క్లుప్తంగా

నేడు విత్తనోత్పత్తిపై అవగాహన సదస్సు

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్లలో విత్తనోత్పత్తిపై రైతులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటనర్సయ్య ఆదివారం తెలిపారు. ఈ సమావేశంలో రైతులందరూ పాల్గొనాలని సూచించారు.

ఎస్‌ఐ అమిరుద్దీన్ బాధ్యతల స్వీకరణ


షేక్ అమిరుద్దీన్

సత్తెనపల్లి: సత్తెనపల్లి రూరల్ ఎస్‌ఐగా షేక్ అమీరుద్దీన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమరావతి నుంచి సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన శివకుమార్ వీఆర్‌కు వెళ్లారు. ఎస్‌ఐ అమిరుద్దీన్ సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు, సత్తెనపల్లి రూరల్ సీఐ పోలూరి శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా తులసి

క్రోసూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ (పీఅండ్ ఈఐ) గా టి.తులసి నియమితులయ్యారు. ఆమె సోమవారం బాధ్యతలు తీసుకుంటారు. క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఇప్పటి వరకు పనిచేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది బదిలీ కానున్నట్లు సమాచారం.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల గ్రామంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కాటూరు హాస్పటల్ సహకారంతో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 270 మంది రోగులు బీపీ, షుగర్, కంటి, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, చర్మవ్యాధులు, జ్వరంతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. గుండె వ్యాధిగ్రస్తులకు ఉచిత పరీక్షలు చేశారు. మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు కుంచనపల్లి కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు కేజీబీవీ విద్యార్థినులు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు కేజీబీవీ విద్యార్థినులు నియోజకవర్గ స్థాయి జిల్లా స్థాయికి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు పీఈటీ యనమాల రాణి ఆదివారం తెలిపారు. హేమర్‌త్రో విభాగంలో అండర్–17 విభాగంలో శ్రీలక్ష్మీ, డి.సోని, అండర్–14 చెస్‌లో హవిల, టెన్నికాయిట్ ప్రణతి, కావ్య వెస్లీ, కుమారి, శ్రావణి, అండర్ –17లో అంజలి, సాగర్‌మాత, సోని, శ్రీలక్ష్మీ, మరియరాణి, అండర్–14 లో పూజ, శ్రీలత, ప్రణతి, హవీల, కావ్యా బ్లెస్సీ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



సత్తెనపల్లి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.విజయ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు–1 టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తూ ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన సీహెచ్ శ్రీనివాసరావుకు సీఐగా పదోన్నతి రావడంతో ఎర్రగొండపాలెం బదిలీ అయ్యారు. 2007లో ఎక్సైజ్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్ శిక్షణ అనంతరం పొన్నూరు, ఎర్రగొండపాలెం స్టేషన్లలో పనిచేశారు. సీఐగా గురజాల, పెదకూరపాడు, గుంటూరు–2 టౌన్, వెంకటగిరి, గూడూరు, గుంటూరు–1 టౌన్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం పాలసీని సమర్థంగా అమలు చేసి, మత్తు పదార్థాలను, అక్రమ మద్యాన్ని అరికట్టడానికి అంకిత భావంతో పనిచేస్తానన్నారు. సీఐగా పదోన్నతి పొందిన క్రోసూరు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా తెల్లపాటి తులసీ, సిబ్బంది మర్యాపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు.

నిధులు దుర్వినియోగం.. అవగాహన శూన్యం

- ఆర్భాటం కోసం రూ.26లక్షలతో రెండు కొత్త ఆర్చిలు
- రూ.5లక్షలతో సత్తెనపల్లి పట్టణంలో నూతన బోర్డులు
- లేని సెంటర్లు ఉన్నట్లుగా... ఉన్నవి లేనట్లుగా ఏర్పాటు
- సంక్షోభం అంటూనే మున్సిపల్ నిధులు దుర్వినియోగం



అగ్నిమాపక కేంద్రం వద్ద హైవేపై బోర్డు ఉండగానే ఏర్పాటు చేసిన ఆర్చి



మున్సిపాలిటీ భవనం లేని వీధిలో బోర్డు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ప్రజాధనాన్ని ప్రణాళికా బద్ధంగా దుర్వినియోగం చేస్తోంది. సంక్షోభమంటూ ప్రజలకు సంక్షేమ పథకాలను దూరం చేస్తూ.. మరోవైపు మున్సిపాలిటీ ఖజానాను ఖాళీ చేస్తున్నారు. ప్రచార ఆర్భాటం కోసం ఫొటోలతో కూడిన ఆర్చ్‌లు ఏర్పాటు చేశారు.

జిల్లాల పునర్విభజనలో భాగంగా గత ప్రభుత్వం సరిహద్దులు తెలిసేలా ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేసింది. గుంటూరు–మాచర్ల జాతీయ ప్రధాన రహదారిలో జిల్లా, పట్టణ, గ్రామీణ సరిహద్దులు తెలియజేస్తూ వీటిని పెట్టారు. ఆ బోర్డులు ఉండగానే.. ప్రస్తుతం కేవలం ప్రచార ఆర్భాటం కోసం సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఫొటోలతో జాతీయ రహదారిలో రూ.26 లక్షలు ఖర్చు చేసి రెండు ఆర్చ్‌లను ఏర్పాటు చేశారు. సరిహద్దులు తెలిపేలా బోర్డులు ఉన్నప్పటికీ నిధులు దుబారా అని తెలిసి కూడా ఖర్చు చేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

పట్టణంలో బోర్డులకు రూ. 5 లక్షలు

పట్టణ పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వార్డుల పరిధిలోని సెంటర్‌ల పేర్లు తెలిపిలే 23 బోర్డులను ఏర్పాటు చేశారు. వీటికి రూ.5 లక్షలు మున్సిపల్ నిధులు కేటాయించారు. లేని సెంటర్, కాలనీ... ఉన్నట్లుగా ఉన్నవి లేనట్లుగా తప్పుడు తడకలుగా బోర్డులు ఏర్పాటు చేయడంతో పట్టణానికి వచ్చే ప్రజలు తికమకపడుతున్నారు. మాస్టర్ ప్లాన ప్రకారం ఏర్పాటు చేసినట్లయితే ఈ సమస్య వచ్చేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లేని గ్రోమోర్ సెంటర్ ఉన్నట్టు బోర్డు

- పట్టణంలో సుమారుగా 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రోమోర్ కేంద్రాన్ని తీసేశారు. ఆ భవనంలో ఇప్పుడు ఓ హాస్పిటల్ నడుస్తోంది. తాజాగా అధికారులు గ్రోమోర్ సెంటర్ అని పేరు పెట్టారు. పాత బస్టాండ్‌కు దారి అని అక్కడ బోర్డు పెట్టాలి. దీనిపై న్యాయవాది కేవీ సాంబశివరావు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించడంతో ఆ బోర్డును తొలగించి, ఎన్టీఆర్ భవన్ రోడ్డు అని మార్చారు.
- ప్రధాన రహదారికి మరోవైపు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ రోడ్డు అని పెట్టారు. ఈ రోడ్డుకు మహానటి సావిత్రి రోడ్ అని గతంలోనే నామకరణం చేసి రిజిస్ట్రేషన్ కూడా చేశారు.
- గడియార స్తంభం పక్కన పూలకొట్టు వద్ద మునిసిపల్ ఆఫీస్ రోడ్డు అని బోర్డు పెట్టారు. ఈ బోర్డు వద్ద నుంచి కట్టమూరి వారి వీధి, గార్లపాడు సెంటర్, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు వస్తుంది. కట్టమూరివారి వీధి అని బోర్డు పెట్టకపోవడంతో అక్కడ కొత్తవారు మునిసిపల్ ఆఫీస్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి.
- ఐదు లాంతర్ల సెంటర్‌లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం ముందు వేణుగోపాలస్వామి గుడి రొడ్డు అని బోర్డు పెట్టారు. ఆలయం కనిపిస్తోంది కనుక ఎవరికైనా ఇట్టే తెలిసి పోతోంది. పైభాగంలో ఉన్న నాగన్నకుంట రోడ్డు అని పెడితే ముందుకు వెళ్లి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇలాగే ఆటో నగర్‌లో సైతం తప్పులు తడకగా బోర్డులు పెట్టారు.



ఎన్టీఆర్ భవన్ రోడ్డు అంటూ బోర్డు

అందరికీ తెలియడం కోసమే బోర్డులు



ప్రజలకు పట్టణంలోని సెంటర్‌లు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేశాం. ఇటీవల గ్రోమోర్ సెంటర్ అని పెడితే విమర్శలు వచ్చాయి. అందు వల్లే ఐదు లాంతర్ల సెంటర్‌లో లేని ఐదులాంతర్లకు సెంటర్ అని పెట్టకుండా వేణుగోపాలస్వామి గుడి సెంటర్ అని పెట్టాం. దీనిలో నిధులు దుర్వినియోగం చేయాడానికి అవకాశం లేదు.

–కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

ఆటోనగర్ ఒకచోట.. బోర్డు మరో చోట



పట్టణంలో ఆటో నగర్ ఒక చోట మొదలైతే... బోర్డును మాత్రం మరొక చోట ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారుల పని తీరుకి ఇది అద్దం పడుతుంది. అధికారులు పురపాలిక మాస్టర్ ప్లాన్ ప్రకారంగా బోర్డులు ఏర్పాటు చేస్తే బాగుండేది. ఆ మాస్టర్ ప్లాన్‌లో అన్ని విషయాలు స్పష్టంగా ఉంటాయి.

–గుజ్జర్లపూడి సతీష్, 11వ వార్డు కౌన్సిలర్, సత్తెనపల్లి

వెలుగు సమాఖ్య అధ్యక్షురాలిగా మహంకాళి



పెదకూరపాడు: మండల వెలుగు సమాఖ్య అధ్యక్షురాలిగా అబ్బరాజుపాలెం గ్రామానికి చెందిన రాయపాటి మహంకాళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ మహంకాళికి నియామక పత్రం అందజేశారు. రాష్ట్ర అంగన్వాడీ, డ్వాక్రా జనరల్ సెక్రెటరీ గంగినేని లీలావతి, తెలుగు మహిళా కార్యనిర్వాక కార్యదర్శి గుమ్మడి పుష్పలత పుష్పగుచ్ఛాలు అందజేశారు. నేతలు ప్రసాద్, దాసు, రాంబాబు, జనసేన నాయకులు కేలం వీరభోగి, మైనార్టీ నాయకులు షేక్ సుభాని, సీనియర్ నాయకులు కేలం నాగేశ్వరావు, ముప్పర సాంబశివరావు, గంగినేని పుల్లారావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

జనసేన జనవాణి



పెదకూరపాడు: కాశిపాడు గ్రామంలో ఆదివారం జనసేన జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు, హౌసింగ్ లోన్ వివిధ గ్రామ సమస్యలపై ప్రజలు పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతిరావుకి అర్జీలు అందజేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు కొత్తం శెట్టి యాదయ్య, మల్లెల రమేష్, హనుమంతరావు బుచ్చిబాబు, సాంబ శివరావు, యశ్వంత్, టీడీపీ గ్రామ ప్రెసిడెంట్ సాంబయ్య, సాంబ శివరావు, శెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థినులు

సత్తెనపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్‌లో పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిస్కస్ త్రోలో ఎం.దీపిక , 800 మీటర్ల పరుగు పందెంలో టి.మహాలక్ష్మి, 100 మీటర్ల రిలే పరుగు పందెంలో ఎస్.అక్షయ, వై.హసీశ్రీ,, కె.కల్పన, వి.మల్లికా, షాట్ పుట్‌లో ఎం.దీపిక, 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ఎం.రాధా, టి.మహాలక్ష్మి, ఎం.దీపిక, పి.షారోన్ పుష్ప విజయం సాధించారు. జూనియర్ విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ఐ.వైష్ణవి, 400 మీటర్ల పరుగు పందెంలో ఐ.వైష్ణవి, టి.హేమలత, 100 మీటర్ల పరుగు పందెంలో టి.హేమలత, 100 మీటర్ల రిలే పరుగు పందెంలో ఎం.వైష్ణవి, టి.మాధవి, టి.హేమలత ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థినులను హెచ్ఎం జె.మాధవీలత, వ్యాయామోపాధ్యాయులు కాకుమాను సునీత, సీహెచ్ శివ గోవర్ధన, పి.శాస్త్రి, ఉపాధ్యాయినులు ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.


విద్యార్థినులతో హెచ్ఎం మాధవీలత, పీడీ శివ గోవర్ధన

నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ

సత్తెనపల్లి: విజయవాడలోని సింగ్ నగర్, రాజీవ్ నగర్, వివిధ ప్రాంతాల్లో వరద ముంపు బారిన పడ్డ కుటుంబాలకు చేయూతనందించేందుకు హెల్ప్ ఫౌండేషన్ బృందం ముందుకొచ్చింది. హైదరాబాద్ ఎస్ఆర్‌డీజే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేమూరి రాధారాణి సూచనలతో పిల్లలు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం విరాళాలు సేకరించారు. ఆదివారం బాధితులకు ఆహార పొట్లాలు, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, చిన్న పిల్లలకు ఆహార పదార్థాలు, వృద్ధులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర సిటీ స్మాల్ కాజెస్ కోర్టు సూపరిండెంట్ పీవీపీ అంజనీ కుమారి బాధితులకు వాటిని అందజేశారు. ఆర్థిక సహకారాన్ని అందచేసిన ఎస్ఆర్‌డీజే స్కూల్ యాజమాన్యానికి, వాటిని అందజేయడంలో ముఖ్య భూమిక పోషించిన హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) వారికి అభినందనలు తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, గుంటూరు మంజు పాల్గొన్నారు.


వరద బాధితులకు నిత్యవసరాలు, దుప్పట్లు పంపిణీ

బ్రాహ్మణులకు ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయాలి

నరసరావుపేట ఈస్ట్: ఎన్నికల సమయంలో బ్రాహ్మణులకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ పల్నాడు జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ప్రకాష్‌నగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో ఆదివారం అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి సమాఖ్య ప్రతినిధులు హాజరయ్యారు. బ్రాహ్మణులకు అన్ని రంగాలలోనూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దేవాలయాలు, బ్రాహ్మణులపై జరుగుతున్న దాడుల్ని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాల్ని రూపొందించాలని కోరారు. కార్పొరేషన్‌లో కుంటుపడిన పథకాలను కొనసాగించాలని, రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో నామినేటెడ్ పోస్ట్‌ల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ తీర్మానించారు. ప్రతి నియోజకవర్గంలో బ్రాహ్మణ భవనాన్ని ఏర్పాటు చేయాలని, వేద విద్యను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులకు నెలకు రూ.1000 ఉపకార వేతనం అందివ్వాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న శివకృష్ణ ప్రసాద్

రసవత్తరంగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక లయోలా హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అండర్ – 17 బాలబాలికల ఆటల పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ మాట్లాడుతూ పోటీల్లో కొన్ని జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు వచ్చాయని తెలిపారు.బాలుర విభాగంలో గుంటూరు, ప్రకాశం, కడప, తూర్పు గోదావరి, అనంతపురం, చిత్తూరు, విశాఖపట్నం, బాలికల విభాగంలో కర్నూలు, చిత్తూరు, విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం, కడప జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు వచ్చాయని ఆయన చెప్పారు. పోటీల్ని వ్యాయామ ఉపాధ్యాయులు టి. యలమంద, ఆర్. రాధాకృష్ణమూర్తి, వై.వి. చిరంజీవిరావు, బి.కొండలు, కె.రాజేష్ పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.



రోడ్డు మరమ్మతులు చేపట్టండి

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు నుంచి బెల్లంకొండ వరకు గుంతలు పడిన ఆర్ అండ్‌బీ రోడ్డుకు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు వాట్సప్ ద్వారా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు లేఖ పంపినట్లు పత్రికా ప్రకటనలో ఆదివారం తెలిపారు. అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు జరుగుతున్న రెండు లేన్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. దొడ్లేరు నుంచి బెల్లంకొండ వరకు పనులు ప్రారంభించలేదని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు పడి కనీసం బస్సులోకూడా ప్రయాణం చేయలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక మరమ్మతులు చేయించాలని కోరారు.

తురకపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ బెల్లంకొండ లూర్దురాజు స్మారకార్థం దూళిపాళ్ల ఎల్వీ ప్రసాద్ ఐ హస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ప్రారంభించారు. 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్ ప్రతాప్, నిర్వాహకులు బెల్లంకొండ గోవశౌరయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

పొలం బాట వివాదంలో రైతుపై దాడి

శావల్యాపురం: పొలానికి వెళ్లిన రైతుపై మరో రైతు దాడిచేసి గాయపరచిన సంఘటన మండలంలోని కారుమంచిలో జరిగింది.సేకరించిన వివరాల ప్రకారం.. కారుమంచి గ్రామానికి చెందిన బొల్లా చంద్రశేఖర్ అనే రైతు వెల్లలచెరువు వద్దనున్న తన పొలంలో దున్నేందుకు ట్రాక్టర్‌తో వెళ్లగా దారి లేదని అదే గ్రామానికి చెందిన శాఖమూరి వెంకట్రావు దుర్భాషలాడుతూ పారతో దాడి చేశాడు.

గాయాలైన చంద్రశేఖర్‌ను కుటుంబ సభ్యులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పొలాలకు చెందిన బాట తొమ్మిది అడుగులు ఉందని చెబుతున్నప్పటికీ దాడి చేసినట్లు బాధితుడుచంద్రశేఖర్ తెలిపాడు.

పోలీసు వృత్తి ఒత్తిళ్లతో కూడుకున్నది


డాక్టర్ నాగరాజారెడ్డి, డాక్టర్ జ్యోతిని సత్కరిస్తున్న డీఎస్పీ హనుమంతరావు


రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

- అవగాహనతో గుండె పదిలం
- సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు

సత్తెనపల్లి: పోలీస్ వృత్తిలో ఒత్తిడి అధికంగా ఉంటుందని, అవగాహనతో గుండెను పదిలంగా చూసుకోవాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు సిబ్బందికి సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ సహకారంతో స్థానిక అనన్య వైద్యశాల వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. పోలీసులకు ఉచిత గుండె పరీక్షల వైద్య శిబిరం మొట్టమొదటిగా తన ఆధ్వర్యంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అడిగిన వెంటనే వైద్య సేవలు అందించిన అనన్య వైద్యశాల వైద్యులు డాక్టర్ చల్లా నాగరాజారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ నాగరాజారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారికి మాత్రమే వచ్చే గుండె జబ్బులు వచ్చేవని, నేడు 20 ఏళ్లకే వస్తున్నాయన్నారు. కోవిడ్ అనంతరం ఈ పరిస్థితి మరింత అధికమైందన్నారు. ఇటీవల కాలంలో 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారే గుండె జబ్బులతో వైద్య శాలలను సంప్రదిస్తున్నారన్నారు. క్రమం తప్పకుండా వాకింగ్, యోగా, ధ్యానం వంటివి చేయాలన్నారు. ధూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని 200 మంది పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్లు, హోంగార్డ్‌లకు ఈసీజీ, ఎకో, టీఎంటీ, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ చల్లా నాగ రాజారెడ్డి, డెర్మటాలజిస్ట్ డాక్టర్ జ్యోతికి డీఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి, సత్కరించారు. డీఎస్పీ హనుమంతరావును వైద్యశాల బృందం సత్కరించింది. ఈ కార్యక్రమంలో సత్తెన పల్లి టౌన్ సీఐ బొప్పన బ్రహ్మయ్య, సత్తెనపల్లిరూరల్ సీఐ పోలూరి శ్రీనివాసరావు, పెదకూరపాడు సీఐ ప్రత్తిపాటి సురేష్, సత్తెనపల్లి టౌన్ ఎస్‌ఐలు ఎం.సంధ్యారాణి, పవన్‌కుమార్, సత్తెనపల్లిరూరల్ ఎస్‌ఐ అమినుద్దీన్, ఏఎస్‌ఐ సుబ్బా రావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జాషువా సేవా సాహితీ సమాఖ్య వార్షికోత్సవాలు


సన్మాన గ్రహీతలు

క్రోసూరు: సత్తెనపల్లి జాషువా సేవా సాహితీ సమాఖ్య 29వ వార్షికోత్సవాలు, గుర్రం జాషువ జయంతి వేడుకల కార్యక్రమం స్థానిక జై భారత్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఆర్ఐఈసీ సెక్రటరీ రాసంసెట్టి నరసింహారావు పాల్గొన్నారు. సమాఖ్య అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా డైట్ కాలేజి ప్రిన్స్‌పల్ ఎన్.విక్టర్ రవిసాగర్, సాహితీ వేత్త ఊటుకూరు వరప్రసాద్ పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులు ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎంఈవో 2 గణేష్ , వివిధ రంగాల్లో సేవలందించిన మన్నెం శ్రీనివాసరావు, శిఖా శ్యాంసన్, అనుమోల పూర్ణచంద్రరావు, రాయిరాంరెడ్డి, ముత్యాల తిరుమల రెడ్డిని ఘనంగా సత్కరించారు. స్కూల్ డైరక్టర్ జైనేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎంఈవో 2 గణేష్ పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి: ఎస్టీయూ



చిలకలూరిపేట: 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ప్రాంతీయ శాఖల సమావేశం పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ దసరా పండుగ కానుకగా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. దీంతో పాటు పెండింగ్ బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించాలని విన్నవించారు. రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి స్కూల్ మేనేజ్‌మెంట్ గ్రాంట్‌ను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించి, బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

హైవేపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు

నాదెండ్ల: జాతీయ రహదారి యడ్లపాడు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ వద్ద ఆదివారం పోలీసులు ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున యాక్సిడెంట్ ఏరియాగా హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. వాహనదారులు వేగాన్ని తగ్గించి నెమ్మదిగా వెళ్లాలంటూ పేర్కొన్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బత్తిన సుబ్బానాయుడు, ఎస్‌ఐ వి. బాలకృష్ణ మాట్లాడుతూ రహదారిపై ఎలాంటి సమస్యలు ఎదురైనా డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు.

